



# అభిమానధనుడు

ముద్దంశెట్టి
హనుమంతరావు

అప్పుడే సూర్యుడు విశ్రమించడానికి అన్నట్టుగా కొండల చాటుకు పోతున్నాడు. ఆల మందలు ఉత్సాహంగా ఇళ్లు చేరుకుంటున్నాయి. కాని, సీతారామయ్య మాత్రం నిర్జీవంగా ఇంట్లో అడుగు పెట్టాడు. పై మీదున్న ఉత్తరీయాన్ని తీసి దండెంమీద వేసి, ఉస్సురనుకుంటూ వాలుకుర్చీలో కూలబడిపోయాడు.

భర్త రాక గమనించి జానకమ్మ వచ్చింది వంట గదిలోంచి.

"ఏమన్నాడండీ ఆ వెంకన్న?" అంది.

సీతారామయ్య క్షణం మౌనం వహించి, నిట్టూర్చాడు.

"ఏమంటాడు జానకీ! కాలం కలిసిరానప్పుడు, త్రాడే పామై కరుస్తుందట. ఆ నాడు కాళ్లా వేళ్లా పడి డబ్బు తీసుకు వెళ్లిన వ్యక్తి, ఈ రోజు, కసురుతూ జవాబిస్తున్నాడు. ఎప్పుడో తన దగ్గర వున్నప్పుడు ఇస్తాడట. ఏం చేస్తాం? కోర్టెక్కడానికి మన కిప్పుడు తాహతు లేదని అతడికీ తెలుసు" అన్నాడు.

జానకమ్మ కోపంతో ఉడికిపోయింది. ఏం

లోకం, ఏం మనుషులు?... అనుకుంది.

"అయినా, ఇంత అన్యాయమేమిటండీ? అతడి దగ్గర ఇప్పుడు డబ్బులేదా ఏమి? ఎగ్గొట్టే ఉద్దేశ్యంతో అంటున్నాడేమిటో?" అంది.

"అయినా అయ్యుండొచ్చు. ఒకవేళ ఆ ఉద్దేశ్యమే అతడి దవుతే మనం చేయగలిగింది కూడా ఏమీ లేదు. రాతకోతల్లో ఉన్నా, ఈ నూరు రూపాయలకోసం అంతకు రెట్టింపు ఖర్చు పెట్టమని ఎవడు చెప్పాడు?"

"న్యాయం ఉండొద్దటండీ?"

"అని మనం అనుకుంటాం. కాని, ఈ యుగంలో న్యాయానికి తావులేదు. మనం కూడా ఓ వాడు మహారాజుల్లా బ్రతికిన వాళ్ళమే! చేతనైనంతవరకూ అవసరమైన వాళ్ళకు సహకరించాం. కాని, ఇప్పు డేమయ్యింది? మన దాయాదులు అబద్ధపు సాక్ష్యాల్ని బనాయించి, డబ్బు వెచ్చించి తమకు సంక్రమించవల్సిన భూములంటూ, మన భూములు కాజేశారు. అదిమాత్రం న్యాయమా? అంతే! అన్యాయమని తెలిసినా, మనం ఏమీ చెయ్యలేకపోయాం. ఏం చేస్తాం! మన రోజులు వక్రంగా నడుస్తున్నప్పుడు, విధి చిన్న చూపు చూస్తున్నప్పుడు అన్యాయమే విజయం సాధించిందంటే, ఆశ్చర్య మేమీ లేదు" —బాధగా అన్నాడు సీతారామయ్య.

జానకి దిగాలుపడింది. భర్తలో క్రమంగా వైరాగ్యం స్థావరం ఏర్పరచుకుంటున్నదని ఆమె కంగారుపడసాగింది.

"ఏమిటోనండీ, అంతా అయోమయంగా ఉంది. అబ్బాయి చదువా, ఆపివేయలేము. డబ్బుకా ఇబ్బందిపడిపోతున్నాము. ఇప్పటికే కొన్ని నగలు అమ్ముకున్నాము. అమ్మాయి చూస్తే, పెళ్లీడుకు వచ్చి ఉన్నది. ఏం చెయ్యటానికీ పాలుపోవడం లేదు. పోనీ, మీరు ఏదన్నా వ్యాపారం ప్రారంభిస్తే? అమ్మాయి గొలుసు అమ్మేసి పెట్టుబడి పెడితేసరి.... అందులోనైనా మనకు అదృష్టం కలిసివస్తుందేమో!"

సీతారామయ్య అదోలా నవ్వాడు. ఆ నవ్వులో బాధ తొంగిచూచింది.

"అది నీ భ్రమ జానకీ! 'అదృష్టం' అన్నది దానంతట అదే మనల్ని వెతుక్కుంటూవస్తుంది. మన రోజులు వంకరయితే, అదృష్టం కోసం మనం వెతికినా చేతికి అందదు. అయినా, అమ్మాయి మెళ్లో ఆ పాటి గొలుసైనా లేకపోతే ఎలా చెప్పు? దాని మనసు ఎంత నొచ్చుకుంటుంది? నాకేం ఇష్టంలేదు."

జానకమ్మ క్షణం మాట్లాడలేదు. భర్త చెప్పినదాంట్లో కొంత సత్యం ఉందేమో ననిపించింది.

"అన్నట్లు యిప్పుడు గుర్తుకు వచ్చింది... జగన్నాధమని మీ స్నేహితుడు ఉండాలి కదండీ!

*"నా ప్రాణం రక్షించావు. కనుక నా బాధ్యత నీదే. అప్పు ఇవ్వు" — అని వెనకటికి ఒకరు ఎవరో అన్నారట. జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఎవరో ఒకరికి సహాయం చేయనివారు ప్రపంచంలో అరుదు. అలా అని బదులు తీర్చమంటే బ్రతుకు వీధిని పడదూ?*

ఇప్పు డెక్కడున్నా డేమిటి?" అంది చప్పున.

"బందరులో వుంటున్నాడు."

"వ్యాపారం చేస్తున్నాడు కదండీ!"

"అవును..." నిర్లిప్తంగా జవాబు చెప్పాడు.

"ఆ మధ్యన మన దగ్గర్నించి డబ్బు తీసుకెళ్లి తెచ్చి యిచ్చేశాడు కదండీ!"


సీతారామయ్యకు విసుగు కలిగింది. "అబ్బ! అవన్నీ ఇప్పు డెందుకు జానకీ! డబ్బు తెచ్చి యిచ్చేశాడు."

జానకమ్మ కాస్తంత మొహం చిట్లించుకుంది.

"అయ్యో! మీకంతా కోపమేనండీ! నే నేమన్నానని? అతనితోపాటు వ్యాపారం సాగిస్తే బావుంటుందేమోనని...."

భార్య మాటలు విన్నాక సీతారామయ్యలో కొత్త ఆశ రేకెత్తింది. జగన్నాధం వ్యాపారంలో సిద్ధహస్తుడు. తను అతనితో చేయి కలిపితే

నర్తకి (తిరువణ్ణామలై ఆలయ ద్వారంలో)
ఫోటో—సి. డి. కె. మూర్తి (మద్రాసు-3)



బాగుంటుందేమో!... అని అనుకున్నాడు. కాని, మరుక్షణంలోనే అభిమానం రాహువులా అడ్డుపడింది. తను మొదటిలా ఆస్తిపరుడు కాదని అతను తెలుసుకుంటే, ఎలా ప్రవర్తిస్తాడో ఓసారి ఊహించుకున్నాడు. అది నిజంగా ఊహే అయినా, మనసు దాన్నే బలపరచింది.

"నీ సలహా బాగానేవుంది జానకీ! కాని,దూరంగా యోచించలేదు నువ్వు. జగన్నాధం జీవితం ఇప్పుడు హుషారుగా సాగుతూంది. మనం ఇప్పుడు చెడిపోయిన వారి కోవకే చెందుతాం. అంతస్థు తగ్గేసరికి మనిషి విలువకూడా తగ్గుతుందని స్వానుభవం వల్ల తెలుసుకున్నాను. అతడు ఏ మాత్రం చిన్నచూపు చూచినా నా మనసుకు చిత్రవధ చేసినట్టుగానే ఉంటుంది. అందుకే ఆ తలంపు చేయడమే నాకు యిష్టంలేదు"—అన్నాడు.

భర్త మనోభిప్రాయాన్ని అవగతం చేసుకుంది జానకమ్మ. అందుకని జగన్నాధం అటువంటి వ్యక్తి కాదని చెప్పడానికైనా సాహసించలేదు.

"అయితే ఇప్పుడు ఏం చేయదలచుకున్నారండీ? అబ్బాయికి యింకా డబ్బు పంపలేదు. వాడేం యిబ్బందులు పడుతున్నాడో ఏమిటో?" అంది జానకమ్మ మళ్లీ.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను. ఒక్కటే మార్గం అగుపిస్తున్నది. ఇంటిమీద ఋణం చెయ్యాలిగాని, ఇంకెవర్నీ చేయిచాచి అడగడం నాకు యిష్టంలేదు..." వ్యధాభరితహృదయుడై అన్నాడు.

జానకమ్మ మొహం పాలిపోయింది.

"చివరికి మనస్థితి, ఈ స్థాయికి వస్తుందని, ఎప్పుడన్నా అనుకున్నామా? ఇంతకూ మన పిల్లలు అదృష్టవంతులు కారు" అన్నది నిట్టూరుస్తూ.

"అంతేలే జానకీ! అదృష్టముంటేనే, అన్ని సుఖాలూ సమకూడుతై. ఏం చేస్తాం?..." అంటూ లేచి "వడ్డించు... ఆకలిగా వుంది" అన్నాడు.

జానకమ్మ అక్కణ్ణుంచి వెళ్లిపోయింది.

• • •

రెండు రోజుల తర్వాత, డబ్బు పంపమని కొడుకు దగ్గర్నించి ఉత్తరం రావడంతో, సీతారామయ్య మరింత కలవరపడ్డాడు. పాపం, వాడెంత యిబ్బంది పడుతున్నాడో అనుకుంటూ, ఆ రోజే రామినాయుడు దగ్గరికి వెళ్లాడు. కొడుక్కు చదువు చెప్పించాక, ఆస్తి మిగలకపోయినా, ఫరవాలేదనుకున్నాడు...కొడుకును



కావలి చిత్రం—కేతినీడి భాస్కరరావు (విజయనగరం)

ప్రయోజకుణ్ణి చెయ్యడమే తను వాడికిచ్చిన ఆస్తి.

సీతారామయ్య తన అభిమతాన్ని నాయుడికి వెల్లడిజేసి ఓ వంద రూపాయలు ప్రస్తుతం కావాలన్నాడు. రామినాయుడు సీతారామయ్యను సానుభూతితో చూసి, "ఏం యుగమండీ సీతారామయ్యగారూ ? ఎల్లాంటి వారు, ఎల్లాంటి స్థితికి వచ్చేశారు? అన్యాయం కాకపోతే, మీ భూములు మీ దాయాదులు ఎలా చేజిక్కించుకొంటారు? డబ్బున్న దగ్గరే న్యాయం ఉంటుం దండీ! అన్యాయాన్ని అరికట్టడానికి, ఎవరూ ప్రయత్నించరు..." అన్నాడు. నిజంగా ఆ సానుభూతి, మొసలి కన్నీరు వంటిదే! ఆ లౌకికం నాయుడికి తెలుసు.

"మరేం చేస్తాం లెండి నాయుడుగారూ! అది మా అదృష్టం. కష్టసుఖాలు, చీకటి వెలుగు వంటి వంటారు. మా అబ్బాయే ప్రయోజకుడైతే, మా జీవితాల్లో మళ్లీ వెలుగు తొంగి చూడకుండా ఉంటుందా? అంతవరకూ ఏదో ఇలా గడిచిపోనిద్దురూ?" నెమ్మదిగా అన్నాడు సీతారామయ్య.

"నిజమే అనుకోండి. అయినా, మీ అబ్బాయిని యింక చదివించడ మెందుకు చెప్పండి? ఏదైనా ఉద్యోగంలో చేర్పకూడదూ?" అయాచితంగా సలహా ఇచ్చాడు రామినాయుడు.

సీతారామయ్య మనసు గాయపడింది. తను డబ్బుకోసం రావడం వల్లనేకదా, నాయుడు అటువంటి సలహా యిచ్చాడనుకుని, అవసరం తనది గాబట్టి తమాయించుకున్నాడు.

"వాడి చదువు, మధ్యలో ఆపడం నాకు యిష్టం లేదండీ. అలా గవుతే, వాడి భవిష్యత్తే నాశనమవుతుంది. అందుకే ఈ తాపత్రయ మంతానూ."

"నిజంగా మీరు గొప్ప సాహసపరులండీ... అన్నట్లు జగన్నాథం గారు ఇప్పుడెక్కడున్నా డేమిటి?"

"బందరులో వుంటున్నాడండీ!"

# అభిమాన ధనుడు

"ఏం చేస్తున్నాడు?"

"వ్యాపారం..."

"ఊహూ... అలాగా! నాలుగు పైసాలు వెనకేసుకున్నా డనుకుంటానే?"

"అయ్యుండవచ్చునండీ!" నిర్లిప్తంగా జవాబిచ్చాడు సీతారామయ్య.

"చూశారా, బళ్లు ఓడలవుతున్నాయి... ఓడలే బళ్లవుతున్నాయి. అతను ఎప్పుడయినా యింత ప్రయోజకుడవుతాడనుకున్నామా ? అతనికి మీరే మొదట్లో సహాయం చేశారని విన్నాను...?" ప్రశ్నార్థకంగా చూశాడు రామినాయుడు.

సీతారామయ్యకు, నాయుడు ప్రశ్న ఏమీ నచ్చలేదు. ఇప్పుడా ప్రసక్తి తీసుకురావడమే అనవసరమనుకున్నాడు.

"అబ్బే! అటువంటిదేమీ లేదండీ! ఆ మధ్య ఏదో కొద్దిపాటి డబ్బు తీసుకు వెళ్లి మళ్లీ తెచ్చి ఇచ్చేశాడు..."

"అదృష్టమండీ, అదృష్టం..." అన్నాడు రామినాయుడు...ఇంకా సంభాషణతో కాలంవృథా చెయ్యడం అతనికి ఇష్టం లేకపోయింది. వెంటనే కాగితం తీసి వ్రాసి, సీతారామయ్య సంతకం తీసుకుని వంద రూపాయలు అందజేశాడు. ఒక విధంగా అతనిలో గర్వం తలెత్తింది. తృప్తి స్థావరం ఏర్పరచుకుంది. సీతారామయ్య తన దగ్గరికి అప్పుకోసం రావడమే అందుకు కారణం. అదే అతని ఆధిక్యం.

"సెలవు తీసుకుంటానండీ" అంటూ బయల్దేరాడు సీతారామయ్య.

"మంచిదండీ! ఎప్పుడైనా అవసరముంటే, వస్తూవుండండి. మనలో మనకేమిటి?" అన్నాడు రామినాయుడు. ఏదో మహా సహకారం చేస్తున్న వాడికి మల్లే.

సీతారామయ్య, ఏమీ జవాబు చెప్పలేదు. రామినాయుడి అంతర్యాన్ని ఇట్టే గ్రహించి, బాధపడుతూ ముందుకు సాగిపోయాడు. ఆరోజు అతనికి సమంగా భోజనం కూడా రుచించ లేదు.

• • •

రోజులు గడుస్తున్నాయి. సీతారామయ్యను చూడాలని వచ్చాడు. జగన్నాథం. సిల్కులాల్చీ, సన్నని పంచె, కండువా వేసుకొని హుందాగా, ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. మనిషిలో ఉత్సాహాన్ని రేకెత్తించేది డబ్బేగామోసు నని, ఇప్పుడు నమ్ముతున్నాడు జగన్నాథం.

చాలా రోజులైన తర్వాత వచ్చిన స్నేహితుణ్ణి వికసితవదనంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు సీతారామయ్య.

"అలా చిక్కిపోయావేమిటి?" అన్నాడు జగన్నాథం.

సీతారామయ్య నవ్వు తెచ్చి పెట్టుకున్నాడు.

"అబ్బే, ఏమీలేదు. ఈ మధ్య కొస్త అస్వస్థత చేసిందిలే" అన్నాడు.

"మరి నాకు ఉత్తరం రాయలేదేం? మంచివాడివే....ఆ... ఎప్పుడు వద్దామనే బయలుదేరినా తీరిక చిక్కే అవకాశం ఉండేదికాదు. ఏదో ఇప్పుడిలా వీలుచేసుకుని వచ్చాను. అబ్బాయి,అమ్మాయి క్షేమమేనా?"

"ఆ! అంతా క్షేమమే!"

"అబ్బాయి ఇంటరు చదువుతున్నాడుకదూ!"


"ఔనోయ్..."

"బావుంది. అమ్మాయి పెళ్లి చేయడానికి ఇంకా బుద్ధి పుట్టడం లేదా ఏమిటోయ్? ఫస్టు క్లాసయిన సంబంధం చూసి ఘనంగా చెయ్యాలి సుమా! అప్పుడు మమ్మల్ని మర్చిపోకేం.." నవ్వుతూ అన్నాడు.

సీతారామయ్య మనస్సు చివుక్కు మంది. జగన్నాథం అన్న విధంగా జరపడం, ఇప్పటి పరిస్థితుల్లో తనకు సాధ్యమా? అలాగని తన స్థితిని స్నేహితునితో చెప్పుకోవడం ఇష్టంలేకపోయింది. కృత్రిమపు నవ్వు తెచ్చుకున్నాడు.

"ఆ!ఆ! అలాగేలే. ఏమేవ్,మనవాడికి వేణ్ణీళ్లు పెట్టు స్నానం చెయ్యడానికి" అంటూ వంట గదివేపు కేకవేశాడు సీతారామయ్య. "లేవోయ్... బట్టలు మార్చుకో. ప్రయాణపు బడలిక తీరనీ మొదట"— ప్రస్తావన మార్చేశాడు. తన అంతస్తు దిగ జారిందని జగన్నాథానికి తెలిస్తే అతనిలో ఏమి మార్పు వస్తుందోనని సీతారామయ్య భయం.

జగన్నాథం స్నానం ముగిశాక, ఇద్దరూ భోజనానికి కూచున్నారు. ఎన్నో విషయాలు చెప్పుకున్నారు. జానకమ్మకు మాత్రం తమ పరిస్థితి జగన్నాథంతో చెప్పుకుంటే, ఏమన్నా ఆదుకుంటాడేమో అనిపించేది. కాని, భర్త అభిమానం గుర్తుకు వచ్చి ఆ ప్రయత్నం మానుకుంది.



చిత్రం—తంగిరాల లక్ష్మీనారాయణ (సికిందరాబాదు)

ఆ సాయంత్రం జగన్నాథం అలా వీధిలోకి బయలుదేరాడు. జగన్నాథం వెంట వెళ్లాలని సీతారామయ్యకు ఉద్దేశ్యమువుతే ఉందిగాని, ఆ రాత్రికి కూర తీసుకు రావడం తప్పనిసరై, ఉండిపోయాడు.

జగన్నాథాన్ని రామినాయుడు చూశాడు.

“ఏమండోయ్ జగన్నాథంగారూ” అంటూ పలకరించాడు అరుగుమీద కూర్చునిఉండే. కాస్తంత పచ్చగా వుండేవాడు అందరికీ స్నేహితుడే మరి!

“నమస్కారమండీ!” అన్నాడు జగన్నాథం మందహాసంతో.

రామినాయుడు ప్రతి నమస్కారం చేస్తూ “రండి...రండి... ఎప్పుడొచ్చారు?” అంటూ ఆహ్వానించాడు. జగన్నాథం వెళ్లి కూర్చున్నాడు. “ఈ వేళనే వచ్చానండీ!”

“ఆ! వ్యాపారం ఎలా సాగుతుంది? బాగానే సాగుతూందని సీతారామయ్యగారు చెప్పారులెండి!” ప్రశ్నవేసి, తన తృప్తికోసం జవాబు కూడా చెప్పుకున్నాడు.

“భగవంతుడి దయవల్ల బాగానే సాగుతూందండీ! ఈ మధ్య ఓ కంట్రాక్టు తీసుకోవాలనుకుంటున్నాను. ఇదంతా మా సీతారామయ్య చేతి చలవే లెండి”—మందహాసంతో అన్నాడు జగన్నాథం.

రామినాయుడులో ఆశ్చర్యం, ఈర్ష్య ఒక్కుమ్మడిని జనించాయి.

“అలాగటండీ! అదృష్టమంటే, అలా వుండాలి. పాపం, సీతారామయ్యగారి పరిస్థితి ఎలా దిగజారిపోయిందో విన్నారుగా?” అన్నాడు.

జగన్నాథం తలమీద పిడుగు పడినట్టయింది.

“ఏమిటి మీరంటున్నది?” ఆశ్చర్యంతో కనుబొమలు ముడుచుకుంటూ అన్నాడు.

“మీకు తెలీదూ?”

“ఏ మయింది?” ఆత్రంగా అడిగాడు జగన్నాథం.

అడిగిందే తడవుగా, ఒక్క అరక్షణమైనా వదలకుండా అంతా చెప్పేశాడు రామినాయుడు.

జగన్నాథానికి అదంతా ఒక స్వప్నంలా తోచింది. సీతారామయ్య ఇన్ని ఉత్తరాలు రాస్తున్నాడు.... ఒక్కదాంట్లోనూ ఈ విషయం ఇమడ్చలేదే? “నాకు ఒక్క ఉత్తరంలో కూడా ఈ విషయం తెలియజెయ్యలేదండీ! అంతేకాదు... స్వయంగా వచ్చానా? ఇప్పుడూ చెప్పలేదు” అన్నాడు బాధగా.

రామినాయుడు మందహాసం చేశాడు. ఆ నవ్వు అర్థం తెలుసుకోలేక పోయాడు జగన్నాథం.

“అభిమానధనుడు కదండీ! అందుకే చెప్పలేదు....పాపం! చాలా యిబ్బంది పడుతున్నాడు. అటు కొడుకు చదువు మాన్పలేక, మొన్నను నా దగ్గర్నించి కొంత పైకం తీసుకెళ్లాడు” తన ఆధిక్యాన్ని వెల్లడించుకున్నాడు రామినాయుడు.

జగన్నాథానికి మరింత బాధ కలిగించిందా విషయం. పరాయి వ్యక్తి దగ్గర అప్పు తీసుకోవడమేమిటి? తను బ్రతికి లేడూ? తనను అడిగితే లేదంటాడా? అవుతే, సీతారామయ్య ఎందుకలా చేశాడు?...జగన్నాథానికి ఈ ఆలోచనలతో బుర్ర తిరిగిపోయింది. చప్పునలేచాడు.

“వస్తానండీ నాయుడుగారూ” అన్నాడు.

“అప్పుడేనా? కాస్సేపు కూచోండి”! మాట వరసకు అన్నాడేగాని, రామినాయుడుకు తెలుసు, జగన్నాథం ఎందుకంత హఠాత్తుగా లేచిపోయాడో.

“మళ్లీ కనుపిస్తాలెండి” అంటూ చరచరా సీతారామయ్య ఇంటికేసి నడిచాడు జగన్నాథం.

బజారుకు వెళ్లి తిరిగి వచ్చిన సీతారామయ్య అప్పుడే వాలు కుర్చీలో నడుం వాలుస్తున్నాడు. జగన్నాథం విసురుగా లోపలికి వచ్చాడు.

“రావోయ్... కూచో” అంటూ లేచాడు సీతారామయ్య.

“అక్కర్లేదు...నేనిప్పుడే బయలుదేరి పోతున్నా” పిడుగుపాటులా అన్నాడు జగన్నాథం.

సీతారామయ్యకు ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్టయింది. జగన్నాథంలో మార్పు రావడానికి కారణం ఏమిటి? తన స్థితి గతులు ఎవరైనా తెలియజేసి ఉంటారేమో! అది తెలుసుకునే, అందరిలా అతనూ తనను చిన్న చూపు చూస్తున్నాడా!... ఈ విధమైన భ్రమకు లోనై మరింత చలించిపోయాడు.

“అదేమిటి జగన్నాథం?” అన్నాడు, ఆశ్చర్యంగా చూస్తూ.

“అది అంతే! నీ ఇంట్లో నేను ఒక్క క్షణం ఉండదల్చుకోలేదు” నిష్కర్షగా అన్నాడు జగన్నాథం.

సీతారామయ్యకు పిచ్చెక్కినట్టయింది.

“నేనేం తప్పుచేశానని?” బేలముఖం వేసి అన్నాడు.

“నువ్వుచేసిన తప్పేమిటో నీకు తెలియదేమిటి?” గట్టిగానే అన్నాడు జగన్నాథం.


అప్పటికే జానకమ్మ, కూతురు వచ్చి దిగ్భ్రమతో నించుని చూస్తున్నారు.

“ఏమిటది చెప్పు...” గొంతు తగ్గించి అన్నాడు సీతారామయ్య.

“ఇంకేమిటి? ఇన్ని ఉత్తరాలు రాశావు. నీ ఆస్తిపాస్తులు దాయాదుల పాలైన విషయం ఒక్క ఉత్తరంలోనైనా వ్రాశావా? ఆ విషయం తెలుసుకునే అర్హత నాకు లేదా? ఆ పాటి విలువ యివ్వలేక పోయావా? పోనీ ఉత్తరాల్లో రాయలేదు. ...ఇక్కడికి వచ్చాక కూడా ఈ విషయం దాచడానికి ప్రయత్నించావు. అసలు, నీ అభిప్రాయం ఏమిటో నాకు అర్థం కాకుండా ఉంది!” చిన్న ఉపన్యాస మిచ్చినట్టు చెప్పుకుపోయాడు.

సీతారామయ్య తను చెప్పబోయే సంజాయిషీ ఏమీ లేదన్నట్టుగా మొహం దించుకొని మౌనంగా ఉండిపోయాడు.

“నేను బ్రతికి వుండగా నువ్విలా ప్రవర్తించడం ఏమీ బాగులేదు సీతారాం. రామినాయుడు దగ్గర అప్పుతీసుకునే ఖర్మ నీకేమొచ్చింది? ఒకానొకప్పుడు నన్ను ఆదరించి, ఆదుకుని నేనీస్థితికి రావడానికి దోహదమిచ్చిన నువ్వు నానుండి సహకారం అర్థించడానికి కించపడ్డావా! ఇదేనా మన స్నేహితానికి వున్న విలువ. నేను నీదగ్గరకు వచ్చి, సహకారం అర్థించలేదూ? మనసులు కలిశాక అభిమానం అన్న పదాన్ని ఓ ప్రక్కకు నెట్టివెయ్యాలి. నిజంగా, నువ్వు చేసినదానికి



పుట్టుకతోనే పని : ఫోటో—గున్నేశ్వరరావు గోవింద్ (ఖర్గపూర్)

# అభిమానధనుడు

నేనెంతో బాధపడుతున్నాను!' వ్యధిత హృదయాన్ని విప్పి, స్నేహితుడి ముందు పెట్టినట్టే చెప్పుకుపోయాడు.

జానకమ్మ ముఖం విప్పారింది. జగన్నాథం మంచితనానికి మనసులోనే అభినందించుకుంది.

"పొరపాటు జరిగిందోయ్ జగన్నాథం" తను చేసింది 'తప్పు' అని అంతరాత్మ బోధిస్తుంటే మెల్లగా అన్నాడు సీతారామయ్య.

"అలా అంటే సరిపోలేదు. తప్పుకు శిక్ష అనుభవించ వలసిందే!" జడ్జి తీర్పు చెప్పినట్టుగా అన్నాడు జగన్నాథం.

అక్కడవున్న ముగ్గురూ అతనివేపు చూశారు. "రేపే, నాతో మీఅందరూ ప్రయాణం కట్టండి. కలకాలం మన రెండు కుటుంబాలూ, ఒకటిగా కలిసి ఉందాం..."

సీతారామయ్యకు ఒక విధంగా ఆనందం కలిగింది గాని, అక్కడికి వెళ్లిఉండడం, అంత సబబుగా ఉండదేమో ననుకున్నాడు.

"అదికాదు జగన్నాథం..." అని ఇంకా ఏదో అనబోయాడు.

"మరింకేమీ అనకు...నన్ను మరి రెచ్చగొట్టకు. పువ్వులమ్మినచోట కట్టెలమ్మి బ్రతకడం కష్టం సీతారాం..." అనేశాడు.

సీతారామయ్య ఇంకేమి అనలేకపోయాడు.

జానకమ్మ హృదయం దూది పింజలా ఉల్లాసంతో తేలిపోయింది. మందహాసం చేసుకుంటూ వంటగది వేపు నడిచింది. తల్లి వెంట కూతురు నడిచింది.

"నీ హృదయం నవనీతం జగన్నాథం..." అన్నాడు సీతారామయ్య. అతని కళ్ళు ఆనంద బాష్పాలతో చెమ్మగిల్లినై.

"ఆ నాడు నేనూ అలాగే భావించాను..." నవ్వుతూ అని "అలా కాలవకేసి పోయివద్దాంపద" అంటూ స్నేహితుడి చేయిపట్టుకుని ముందు నడిచాడు జగన్నాథం...

సీతారామయ్య ఉత్సాహంగా ముందడుగు వేశాడు మళ్లీ ఆ రోజు... ★

# పథవిహీన

(11వ పేజి తరువాయి)

చెప్పిందట. అందుకని బ్రతికే ఉంటుందని ఆయన నమ్మకం. ఎప్పటికో ఒకనాటికి తిరిగి వస్తుందనే ఆశచేత నూజివీడు వదలటం లేదాయన."

ఆ సమాధానం విని నిట్టూర్పకుండా ఉండలేకపోయింది నానా. ఇందులో ఏదయినా విలువ అంటూ ఉన్నదీ అంటే శతవిధాల ఆడదాని విలువ అయిఉండదు. అది అతని ప్రవృత్తి విలువే అయి ఉంటుంది. అందుకేనేమో విజయ అంత పవిత్రంగా జీవించగలగడం? ఆమె ప్రేమ పవిత్రతకు ఆధారమైన కేంద్ర బిందువు. అతి బలవత్తరమైనది. బాలచంద్ర వంకచూసినవ్వుకుంది ఆమె.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"ఏమీ లేదు. నువ్వు విజయ భర్తవి అయి ఉంటే...ఆమె ఇలా పవిత్రతకోసం ప్రాణం తీసుకుని ఉండేది కాదు. నాలా బ్రతికే ఉండేది."

"అయితే ఈ రెండింటిలో నీ కేది గొప్పగా కనిపిస్తున్నదో చెప్పు మరి" అని రెట్టించాడు బాలచంద్ర.

"మహమద్ ఒకచోట ఇలా అంటాడు—అతను స్వర్గ దృశ్యం చూడగానే అక్కడ ఉన్న చాలా మంది బీదవాళ్ళుగా ఉన్నారు. తరువాత నరక దృశ్యం చూశాడట. అక్కడ ఉన్నవాళ్ళందరూ స్త్రీలేనట."

"అంటే?"

"స్త్రీ ఏ పద్ధతిలో జీవించినా స్త్రీ అవగానే దుఃఖాన్ని నరకాన్ని అనుభవించక తప్పదు. ఆ స్త్రీ హిందూ యువతి విజయలక్ష్మి కావచ్చును. ఫ్రెంచి స్త్రీ నానా హిల్డా కావచ్చును" అన్నది నానా. కొంచెంసేపు నలుగురి మధ్యా నిశ్శబ్దం గూడు కట్టింది.

"కర్తవ్యం కనిపించటం లేదు." నిట్టూర్చాడు జగన్నాథం.

"అన్నయ్య సంగతే బాధగా ఉంది. ఈ పాపని కంతటికీ అనాలోచితంగా నేను చేసిన పని కారణం" అన్నాడు నాగేశ్వరరావు.

"ఆ సంగతి నేను ఒప్పుకోను. హృదయం ఉన్న మనిషి ఎవరయినా అదే పని చేస్తారు. బ్రతుకు సినిమా కాకుండా ఉంటే" అని సిగరెట్ పొగ రింగులలోనుంచి నానా వంక చూశాడు బాలచంద్ర.

"జగన్నాథంగారూ, స్వామి ఎక్కడున్నారు ఇప్పుడు?"

"సీతానగరం ఆశ్రమంలో నట. వెళ్ళి చూడా లనుకుంటున్నాను. మీకు తెలుసా స్వామి?" లేచి ప్రశ్నించాడు జగన్నాథం.

"తెలుసు."

"సరే. నేను వెళ్ళివస్తాను, నాగేశ్వరరావు గారూ! ఇందులో ఎవరి తప్పూ ఏమీలేదు. ఇలాటి దురదృష్టాలకు ఫలితాలేతప్ప కారణాలుండవు. మీరేం విచారించకండి" అని అందరికీ నమస్కరించి గుమ్మం దాటాడు జగన్నాథం.

అతను వెళ్ళేదాకా తనను తను ఆపుకున్న బాలచంద్ర చిరునవ్వు నవ్వుతూ "ఆ స్వామి ఎవరో ఆయన చేత నాకుకూడా సన్యాసదీక్ష ఇప్పిద్దూ?" అన్నాడు.

"ఈ విషయంలో పరిహాసం మానేయి బాలా. అంతదూరం నీబోటివాళ్ళు ఆలోచించటం కూడా అనవసరం" అని చిరుకోపంతో సమాధానం ఇచ్చింది నానా.

నాగేశ్వరరావు ఈ సంభాషణ వినటం లేదు.

ఇంగ్లీషు నీతి ప్రకారం అసాధ్యమైన హేతువు కాని పరిస్థితిలో తన స్వేచ్ఛను ఇతరుల స్వేచ్ఛకు ఆఘాతం రానంతవరకూ తీసుకుపోవచ్చునని ఉన్నది. ఇప్పుడు తన స్వేచ్ఛ ఇతరుల స్వేచ్ఛకు మాత్రమే కాదు, జీవితానికి కూడా వ్యాఘాతం కలిగించింది. దీనికి నిష్కృతి లేదు.

(సశేషం)